12-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - డెడ్ సైలెన్స్లోకి వెళ్ళే అభ్యాసము చేయండి, బుద్ధి తండ్రివైపు ఉన్నట్లయితే అశరీరులుగా అయ్యేందుకు తండ్రి కూడా మీకు సకాష్ ను ఇస్తారు"

ప్రశ్న:- పిల్లలైన మీకు ఎప్పుడైతే జ్ఞానమనే మూడవ నేత్రము లభిస్తుందో, అప్పుడు ఏ సాక్షాత్కారము జరుగుతుంది?

జవాబు:- సత్యయుగ ఆది నుండి కలియుగ అంతిమం వరకు మనం ఏ విధంగా పాత్రను అభినయిస్తాము అన్నది అంతా సాక్షాత్కారమవుతుంది. మీరు మొత్తం విశ్వం గురించి ఆది నుండి అంతిమం వరకూ తెలుసుకుంటారు. అలా తెలుసుకోవడాన్నే సాక్షాత్కారము అని అంటారు. మనము ఒకప్పుడు దైవీ గుణాలు గల దేవతలుగా ఉండేవారమని, అసురీ గుణాలు కలవారిగా అయ్యామని, ఇప్పుడు మళ్ళీ దైవీ గుణాలు కల దేవతలుగా అవుతున్నాము అని మీరు ఇప్పుడు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు మనం కొత్త ప్రపంచంలోకి, కొత్త ఇంటిలోకి వెళ్తాము.

ఓం శాంతి. పిల్లలు స్మృతి యాత్రలో కూర్చున్నారు. అనంతమైన తండ్రి అయితే యాత్రలో కూర్చోలేదు, వారు పిల్లలకు సకాష్ అందించే సహాయమును చేస్తున్నారు అనగా ఈ శరీరమును మరిపింపజేస్తున్నారు. పిల్లలకు శరీరమునే మర్చిపోయే విధంగా తండ్రి సహాయం లభిస్తుంది. ఆత్మలకు సకాష్ ను ఇస్తారు ఎందుకంటే తండ్రి ఆత్మల వైపే చూస్తారు. మీ ప్రతి ఒక్కరి బుద్ధి తండ్రి వైపుకు వెళ్తుంది. తండ్రి బుద్ధి మరియు దృష్టి మళ్ళీ పిల్లల వైపుకు వెళ్తుంది. తేడా ఉంది కదా. (డెడ్ సైలెన్స్) డెడ్ సైలెన్స్ యొక్క అభ్యాసము చేస్తారు, శరీరమును వదిలి వేరవ్వాలని అనుకుంటారు. ఎంతగా స్మృతి చేస్తూ ఉంటారో అంతగా ఈ శరీరము నుండి బయటకు వెళ్ళిపోతామని ఆత్మ భావిస్తుంది. సర్పం ఉదాహరణను ఇస్తారు, ఏ ఉదాహరణలనైతే ఇస్తారో వాటిలో తప్పకుండా ఏదో ఒక విశేషత ఉంటుంది. మనం శరీరాన్ని వదిలి తిరిగి వెళ్ళిపోతామని, మళ్ళీ తిరిగి వస్తామని మీకు తెలుసు. ఈ విషయాల గురించి ఇంకెవరికీ తెలియదు. ఈ డ్రామా గురించి ఎవ్వరికీ తెలియదు. ఈ స్మృతి ద్వారా మీ వికర్మలు వినాశనమవుతాయి అని ఈ విధంగా ఎవరూ గ్యారంటీ ఇవ్వరు. ఇటువంటి విషయాన్ని ఎవరూ వినిపించరు. ఇప్పుడు ఇది మన తిరుగు ప్రయాణము అని పిల్లలైన మీకు తెలుసు. ఆత్మ బుద్ధియోగం అటువైపు ఉంది. ఇప్పుడు నాటకం పూర్తయ్యింది, ఇప్పుడిక ఇంటికి వెళ్ళాలి. తండ్రినే స్మృతి చేయాలి. వారే పతితపావనుడు. గంగ నీటిని ముక్తిదాత మరియు మార్గదర్శకుడు అని అనరు. ఒక్క తండ్రి మాత్రమే ముక్తిదాత మరియు మార్గదర్శకునిగా అవ్వగలరు. ఇవి కూడా బాగా అర్థం చేసుకోవలసిన మరియు అర్థం చేయించవలసిన విషయాలు. అది భక్తి. దాని ద్వారా ఎటువంటి కళ్యాణము జరుగదు. పిల్లలకు తెలుసు - నీరు అనేది స్నానం కొరకు ఉంది. నీరు ఎప్పుడూ పావనంగా చేయలేదు. అలాగని కూడా కాదు, కానీ భావనకు ప్రతిఫలము ఎంతో లభించవచ్చు. భక్తి మార్గంలో దానికి మహత్వమును ఉంచారు. ఈ విషయాలన్నింటినీ అంధ విశ్వాసము అని అంటారు. ఇటువంటి విశ్వాసాన్ని ఉంచుతూ-ఉంచుతూ మనుష్యులకు - అంధుల పిల్లలు అంధులు అన్న టైటిల్ లభిస్తుంది. భగవానువాచ ఉంది కదా. అంధులు ఎవరు మరియు కళ్ళున్నవారు ఎవరు అనేది కూడా మీకు తెలుసు. ఇప్పుడు మొత్తం సృష్టి యొక్క ఆదిమధ్యాంతాలను తండ్రి ద్వారా తెలుసుకున్నారు. మీరు తండ్రిని తెలుసుకున్నారు కావున సృష్టి యొక్క ఆదిమధ్యాంతాలను మరియు కాల వ్యవధిని కూడా తెలుసుకున్నారు. ఒక్కొక్క విషయము గురించి విచార సాగర మథనము చేసి మీకు మీరే నిర్ణయించుకోవలసి ఉంటుంది. భక్తికి మరియు జ్ఞానానికి మధ్యన వ్యత్యాసం ఉంది. జ్ఞానం పూర్తిగా అతీతమైనది. ఈ జ్ఞానం ప్రసిద్ధమైనది. ఇది రాజయోగము యొక్క చదువు కదా. దేవతలు సంపూర్ణ నిర్వికారులుగా ఉండేవారని కూడా పిల్లలకు తెలిసింది. రచయిత అయిన తండ్రే కూర్చొని తమ పరిచయాన్ని కూడా ఇస్తారు. వారు పరమ ఆత్మ. పరమ ఆత్మనే పరమాత్మ అని అంటారు. ఇంగ్లీష్ లో సుప్రీమ్ సోల్ అని అంటారు. సోల్ అనగా ఆత్మ. తండ్రి ఆత్మ పెద్దగా ఏమీ ఉండదు. ఎలాగైతే పిల్లలైన మీ ఆత్మ ఉందో, అలాగే తండ్రి ఆత్మ కూడా ఉంటుంది. అంతేకానీ పిల్లలు చిన్నగా, తండ్రి పెద్దగా ఉంటారని కాదు. అలా కాదు. వారు ఉన్నతోన్నతుడైన, జ్ఞానసాగరుడైన తండ్రి, వారు ఎంతో ప్రేమగా పిల్లలకు అర్థం చేయిస్తూ ఉంటారు. పాత్రను అభినయించేది ఆత్మ. తప్పకుండా శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తుంది. ఆత్మ నివసించే స్థానము శాంతిధామము. ఆత్మలు బ్రహ్మ మహతత్వములో ఉంటాయని పిల్లలకు తెలుసు. ఏ విధముగా హిందుస్థాన్ లో ఉండేవారు స్వయాన్ని హిందువులుగా పిలుచుకుంటారో, అలాగే బ్రహ్మాండములో ఉండేవారు బ్రహ్మాండమును ఈశ్వరునిగా భావిస్తున్నారు. డ్రామాలో దిగజారిపోయే ఉపాయము కూడా రచించబడి ఉంది. ఎవరు ఎంతగా కష్టపడినా

కానీ ఎవరూ తిరిగి అయితే వెళ్ళలేరు. నాటకము ఎప్పుడైతే పూర్తవుతుందో, అప్పుడు పాత్రధారులందరూ వచ్చి కలుస్తారు. రచయిత, ముఖ్యమైన పాత్రధారి కూడా నిలబడతారు. ఇప్పుడు ఈ నాటకము పూర్తవుతుందని పిల్లలకు తెలుసు. ఈ విషయాల గురించి సాధు-సన్యాసులు మొదలైనవారెవ్వరూ తెలుసుకోలేరు. ఆత్మకు సంబంధించిన ఈ జ్ఞానం ఎవ్వరికీ లేదు. పరమాత్మ తండ్రి ఇక్కడికి ఒక్కసారి వస్తారు. మిగిలినవారంతా ఇక్కడ పాత్రను అభినయించాల్సిందే. వృద్ధి జరుగుతూ ఉంటుంది కదా. ఆత్మలన్నీ ఎక్కడి నుండి వచ్చాయి? ఒకవేళ ఎవరైనా తిరిగి వెళ్ళినట్లయితే మళ్ళీ అది ఒక ఆచారముగా అయిపోతుంది. ఒకరు వస్తారు, ఇంకొకరు వెళ్తారు. మళ్ళీ అప్పుడు పునర్జన్మలు అని అనలేరు. పునర్జన్మలు మొదటి నుండే కొనసాగుతాయి. మొదటి నంబరులో ఈ లక్ష్మీ-నారాయణులు ఉన్నారు. తండ్రి అర్థం చేయించారు - పునర్జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ చివరికి ఎప్పుడైతే చేరుకుంటారో, అప్పుడు మళ్ళీ మొదటి నంబరులోకి వెళ్ళవలసి ఉంటుంది. ఇందులో సంశయం యొక్క విషయమేదీ ఉండదు. ఆత్మల యొక్క తండ్రి స్వయంగా వచ్చి అర్థం చేయిస్తారు. ఏమి అర్థం చేయిస్తారు? తమ పరిచయాన్ని కూడా ఇస్తారు. పరమాత్మ అంటే ఎవరో ఇంతకుముందు తెలుసా. కేవలం శివుని మందిరాలకు వెళ్ళేవారు. ఇక్కడైతే లెక్కలేనన్ని మందిరాలు ఉన్నాయి. సత్యయుగములో మందిరాలు, పూజలు మొదలైనవేవీ ఉండనే ఉండవు. అక్కడ మీరు పూజ్య దేవీ-దేవతలుగా అవుతారు. మళ్ళీ అర్ధ కల్పం తర్వాత పూజారులుగా అవుతారు, అప్పుడు వారిని దేవీ-దేవతలు అని అనరు. మళ్ళీ తండ్రి వచ్చి పూజ్యులుగా తయారుచేస్తారు. ఇంకే దేశములోనూ ఈ గాయనము లేదు. రామ రాజ్యము, రావణ రాజ్యము గురించి ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. రామరాజ్యము కాల వ్యవధి ఎంత అనేది మీరు నిరూపించాలి. ఇది నాటకము, దీనిని అర్థం చేసుకోవాలి. ఉన్నతోన్నతమైనవారు తండ్రి, వారు నాలెడ్జ్ ఫుల్. మనము వారి ద్వారా ఉన్నతోన్నతముగా అవుతాము, ఉన్నతోన్నతమైన పదవి లభిస్తుంది. తండ్రి మనల్ని చదివిస్తారు, దైవీ గుణాలను కూడా ధారణ చేయాలి.

మీరు ఇలా ఉన్నారు, మేము ఇలా ఉన్నాము అని పిల్లలు వర్ణన చేస్తారు. మనం వీరి వలె సంపూర్ణ నిర్వికారులుగా అవ్వాలని ఈ సమయంలో మీకు తెలుసు. తండ్రిని స్మృతి చేయడం తప్ప ఇంకే ఉపాయమూ లేదు. ఒకవేళ ఎవరికైనా తెలిస్తే చెప్పండి. బ్రహ్మాండము లేక బ్రహ్మతత్వము నిర్వికారి అని ఏమైనా అనగలరా. అలా కాదు, ఆత్మయే నిర్వికారిగా అవుతుంది. బ్రహ్మమును లేక తత్వమును ఆత్మ అని అనరు. అదైతే నివసించే స్థానము. ఆత్మలోనే బుద్ధి ఉందని పిల్లలకు అర్థం చేయించడం జరిగింది. ఎప్పుడైతే ఆత్మ తమోప్రధానముగా అవుతుందో, అప్పుడు బుద్ధిహీనముగా అయిపోతుంది. వివేకవంతులు మరియు వివేకహీనులు ఉన్నారు కదా. మీ బుద్ధి ఎంత స్వచ్ఛముగా అవుతుంది, మళ్ళీ తర్వాత మాలిన్యంగా అయిపోతుంది. మీకు పవిత్రత మరియు అపవిత్రత మధ్యన వ్యత్యాసం గురించి తెలిసింది. అపవిత్రమైన ఆత్మ తిరిగి వెళ్ళలేదు. ఇప్పుడు అపవిత్రము నుండి పవిత్రముగా ఎలా అవ్వాలి, దీని కోసం ఎంతో కష్టపడుతూ ఉంటారు. ఇది కూడా డ్రామాలో నిశ్చయించబడి ఉంది. ఇప్పుడు మీకు తెలుసు - ఇది సంగమయుగము, తీసుకువెళ్ళేందుకు తండ్రి ఒక్కసారి మాత్రమే వస్తారు. అందరూ కొత్త ప్రపంచములోకైతే వెళ్ళరు. ఎవరికైతే పాత్ర ఉండదో వారు శాంతిధామములో ఉంటారు, అందుకే చిత్రాలలో కూడా చూపించడం జరిగింది. ఇకపోతే మిగిలిన చిత్రాలు మొదలైనవేవైతే ఉన్నాయో, అవన్నీ భక్తి మార్గానికి సంబంధించినవి. ఇవి జ్ఞాన మార్గానికి సంబంధించినవి, దీని ద్వారా ఏమి అర్థం చేయించడం జరుగుతుందంటే - సృష్టి చక్రం ఎలా తిరుగుతుంది, మనం ఏ విధంగా కిందకు దిగుతాము, 14 నుండి 12 కళల వారిగా ఎలా అవుతాము అని. ఇప్పుడు ఏ కళలూ లేవు. నంబరువారుగా అయితే ఉన్నారు కదా. పాత్రధారులు కూడా నంబరువారుగా ఉంటారు. కొందరి జీతము 1000, 1500, కొందరికి 100 ఉంటుంది, ఎంత తేడా ఉంది. చదువులో కూడా ఎంతగా రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది! ఆ స్కూల్లో ఎవరైనా ఫెయిల్ అయితే మళ్ళీ చదువుకోవాల్సి ఉంటుంది. ఇక్కడైతే మళ్ళీ చదువుకునే విషయమే లేదు. పదవి తగ్గిపోతుంది. మళ్ళీ ఎప్పుడూ చదువు ఉండనే ఉండదు. చదువు ఒకేసారి ఉంటుంది. తండ్రి కూడా ఒకేసారి వస్తారు. మొట్టమొదట ఒకే రాజధాని ఉండేదని పిల్లలకు కూడా తెలుసు. ఇది మీరు ఎవరికి అర్థం చేయించినా వారు అంగీకరిస్తారు. క్రిస్టియన్లు సైన్స్ లో కూడా చాలా చురుకుగా ఉన్నారు మరియు అందరూ వారి నుండే నేర్చుకున్నారు. వారిది అంత పారస బుద్ధిగానూ ఉండదు, అంత రాతి బుద్ధిగానూ ఉండదు. ఈ సమయంలో వారి బుద్ధి అద్భుతము చేస్తుంది. సైన్స్ ప్రచారమంతా ఈ క్రిస్టియన్ల ద్వారానే వెలువడింది. అదికూడా సుఖము కొరకే. ఈ పాత ప్రపంచ వినాశనము జరగాల్సిందేనని మీకు తెలుసు. మళ్ళీ మీరు శాంతిధామములోకి-సుఖధామములోకి వెళ్ళిపోతారు. లేకపోతే ఇంతమంది మనుష్యాత్మలు తిరిగి ఇంటికి ఎలా వెళ్ళగలరు? సైన్స్ ద్వారా వినాశనం జరుగుతుంది. ఆత్మలందరూ శరీరాన్ని వదిలి ఇంటికి వెళ్ళిపోతారు. ఈ వినాశనంలో ముక్తి ఇమిడి ఉంది. అర్ధ కల్పం ముక్తి కొరకే కష్టపడుతూ వచ్చారు కదా. కావున సైన్స్ మరియు ప్రకృతి వైపరీత్యాలు, వాటినే ఈశ్వరీయ ఆపదలు అని అంటారు, అవి కూడా జరగాలి. ఈ యుద్ధము

ముక్తిధామములోకి తీసుకువెళ్ళేందుకు నిమిత్తమవుతుందని అర్థం చేసుకోవాలి. ఇంతమంది ముక్తిధామములోకి వెళ్ళాలి. మీరు ఎంత కష్టపడినా, గురువులను ఆశ్రయించినా, హఠయోగము నేర్చుకున్నా, ఎవరూ కూడా ముక్తిధామములోకి వెళ్ళలేరు. ఇన్ని సైన్స్ యొక్క బాంబులు మొదలైనవి తయారయ్యాయి, తద్వారా వినాశనం తప్పకుండా జరుగుతుందని అర్థం చేసుకోవాలి. కొత్త ప్రపంచములో తప్పకుండా చాలా కొద్దిమందే ఉంటారు. మిగిలినవారంతా ముక్తిధామములోకి వెళ్ళిపోతారు. జీవన్ముక్తిలోకి చదువు యొక్క శక్తితో వస్తారు. మీరు అచలమైన, స్థిరమైన, అఖండమైన రాజ్యాన్ని పరిపాలిస్తారు. ఇక్కడ చూడండి - అన్ని ఖండాలూ ముక్కలు ముక్కలుగా ఉన్నాయి. బాబా మిమ్మల్ని స్థిరమైన, అఖండమైన, మొత్తం విశ్వం యొక్క రాజధానికి యజమానులుగా తయారుచేస్తారు. అనంతమైన తండ్రి వారసత్వము అనంతమైన రాజ్యాధికారము. ఈ వారసత్వమును ఎప్పుడు ఇచ్చారు మరియు ఎవరు ఇచ్చారు? ఇది ఎవరి బుద్ధిలోకీ రాదు. కేవలం మీకు మాత్రమే తెలుసు. జ్ఞానమనే మూడవ నేత్రము ఆత్మకే లభించింది. ఆత్మ జ్ఞాన స్వరూపముగా అవుతుంది. అది కూడా జ్ఞానసాగరుడైన తండ్రి ద్వారానే అలా అవ్వవలసి ఉంటుంది. తండ్రే వచ్చి రచయిత మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇస్తున్నారు. ఇది క్షణం యొక్క విషయము. క్షణములో జీవన్ముక్తి. మిగిలిన వారందరికీ ముక్తి లభిస్తుంది. ఇది కూడా డ్రామా రచించబడి ఉంది. రావణుని బంధనము నుండి అందరూ ముక్తులైపోతారు. వారు విశ్వములో శాంతి కొరకు ఎంతగా కష్టపడుతూ ఉంటారు. విశ్వములో మరియు బ్రహ్మాండములో శాంతి ఎప్పుడు ఏర్పడుతుంది అన్నది కేవలం పిల్లలైన మీకు మాత్రమే తెలుసు. బ్రహ్మాండములో శాంతి ఉంటుంది, ఆ తర్వాత విశ్వములో సుఖము మరియు శాంతి రెండూ ఉంటాయి. విశ్వము పేరు మరియు బ్రహ్మాండము పేరు. బ్రహ్మాండము, చంద్రుడు-నక్షత్రాల కన్నా అతీతంగా ఉంటుంది. అక్కడ ఇవేవీ ఉండవు. దానిని సైలెన్స్ వరల్డ్ అని అంటారు. శరీరాన్ని వదిలి సైలెన్స్ లోకి వెళ్ళిపోతారు. పిల్లలైన మీకు అది కూడా గుర్తుంది. మీరు ఈ సమయంలో అక్కడకు వెళ్ళేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది ఇంకెవరికీ తెలియదు. మీ చేత ఏర్పాట్లు చేయించడం జరుగుతుంది. ఇకపోతే ఈ యుద్ధమైతే కళ్యాణకారియే, అందరి లెక్కాచారాలు తీరాల్సిందే. అందరూ పవిత్రముగా అవుతారు. ఇది యోగాగ్ని కదా. అగ్ని ద్వారా ప్రతి వస్తువూ పవిత్రముగా అవుతుంది. ఏ విధముగా తండ్రికి ఆదిమధ్యాంతాల గురించి తెలుసో, అలాగే పాత్రధారులైన మీరు కూడా డ్రామా ఆదిమధ్యాంతాల గురించి తెలుసుకోవాలి. అలా తెలుసుకోవడమునే సాక్షాత్కారము అని అంటారు.

ఇప్పుడు మీ జ్ఞానమనే మూడవ నేత్రము తెరుచుకుంది. తప్పకుండా మనం మొత్తం విశ్వాన్ని, సత్యయుగ ఆది నుండి కలియుగ అంతిమం వరకూ పూర్తిగా తెలుసుకున్నాము. ఇంకే మనుష్యమాత్రులకూ అది తెలియదు. మీరు అర్థం చేసుకుంటారు - మనమే దైవీ గుణాల వారిగా ఉండేవారము, మళ్ళీ మనమే అసురీ గుణాల వారిగా అవుతాము. మళ్ళీ తండ్రి వచ్చి దైవీ గుణాల వారిగా తయారుచేస్తారు. పతితులను పావనంగా తయారుచేసేందుకే తండ్రి వస్తారు. ఈ దేవీ-దేవతా వంశానికి చెందినవారే పూర్తిగా 84 జన్మలు తీసుకుంటారని ప్రపంచంలో ఇంకెవరికీ తెలియదు. వారే పావనంగా, మళ్ళీ వారే పతితులుగా అవుతారు. ఇది ఎవరి బుద్ధిలోనూ లేదు. ఇవి జడ చిత్రాలని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. వారి ఖచ్చితమైన ఫోటోనైతే ఎవరూ తీయలేరు. వారు సహజసిద్ధముగా తెల్లగా ఉంటారు. పవిత్రమైన ప్రకృతితో శరీరాలు కూడా పవిత్రముగా తయారవుతాయి. ఇక్కడ అపవిత్రముగా ఉన్నాయి. ఈ రంగు-రంగుల ప్రపంచము సత్యయుగములో ఉండదు. శ్రీకృష్ణుడిని శ్యామసుందరుడు అని అంటారు. సత్యయుగములో సుందరముగా ఉంటారు, కలియుగములో శ్యామంగా ఉంటారు. సత్యయుగము నుండి కలియుగములోకి ఎలా వస్తారు అనేది మీకు నంబరు వన్ నుండి మొదలుకొని తెలిసింది. శ్రీకృష్ణుడు గర్భము నుండి వెలువడగానే పేరు లభిస్తుంది. పేరు అయితే తప్పకుండా కావాలి కదా. మీరు అంటారు - శ్రీకృష్ణుని ఆత్మ సుందరముగా ఉండేది, మళ్ళీ శ్యామముగా అయ్యింది అందుకే శ్యామసుందరుడు అని అంటారు. వారి జన్మపత్రి లభించిందంటే మొత్తం చక్రమంతటిదీ లభించినట్లే. ఎంతటి రహస్యము నిండి ఉంది, దీనిని మీరు మాత్రమే అర్థం చేసుకోగలరు, ఇంకెవరూ అర్థం చేసుకోలేరు. మీరు ఇప్పుడు కొత్త ప్రపంచములోకి, కొత్త ఇంటిలోకి వెళ్ళాలి. ఎవరైతే మంచి రీతిలో చదువును చదువుతారో, వారే కొత్త ప్రపంచములోకి వెళ్తారు. బాబా అనంతమైన మొత్తం ప్రపంచానికి యజమాని, సర్వాత్మలకు తండ్రి. తండ్రిని యజమాని అని అంటారు, ఇది చదువు. ఇందులో సంశయం కానీ, ప్రశ్న కానీ ఉత్పన్నమవ్వడానికి లేదు. ఇందులో శాస్త్రాల చర్చ చేయవలసిన అవసరం లేదు. ఒక్క టీచరే అందరికన్నా ఉన్నతమైనవారు, వారు కూర్చొని చదివిస్తారు. వారే సత్యమైనవారు. సత్యనారాయణుని సత్యమైన కథను శిక్షణ రూపములో వినిపిస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ లెక్కాచారాలన్నింటినీ తీర్చుకొని సైలెన్స్ వరల్డ్ లోకి వెళ్ళేందుకు ఏర్పాట్లు చేయాలి. స్మృతి బలం ద్వారా ఆత్మను సంపూర్ణ పావనముగా తయారుచేసుకోవాలి.

2. జ్ఞానసాగరుని జ్ఞానాన్ని స్వరూపములోకి తీసుకురావాలి. విచార సాగర మంథనము చేసి మీ నిర్ణయాన్ని మీరే తీసుకోవాలి. జీవన్ముక్తిలో శ్రేష్ఠ పదవిని పొందేందుకు దైవీ గుణాలను ధారణ చేయాలి.

వరదానము:- తండ్రితో ఉంటూ-ఉంటూ వారి సమానంగా అయ్యే సర్వ ఆకర్షణల ప్రభావము నుండి ముక్త భవ

ఎక్కడైతే తండ్రి స్మృతి ఉంటుందో అనగా తండ్రి తోడు ఉంటుందో అక్కడ దేహాభిమానము ఉత్పన్నమవ్వలేదు. తండ్రితో కలిసి తండ్రికి దగ్గరగా ఉండేవారు, ప్రపంచపు వికారీ వైబ్రేషన్లు మరియు ఆకర్షణల ప్రభావము నుండి దూరమైపోతారు. ఈ విధంగా కలిసి ఉండేవారు, కలిసి ఉంటూ-ఉంటూ తండ్రి సమానంగా అయిపోతారు. తండ్రి ఏ విధంగా ఉన్నతోన్నతమైనవారో, అలా పిల్లల స్థితి కూడా ఉన్నతంగా తయారవుతుంది. కింద ఉన్న ఏ విషయాలూ వారిపై ప్రభావమును చూపించలేవు.

స్లోగన్:- మనస్సు మరియు బుద్ధి కంట్రోల్ లో ఉన్నట్లయితే అశరీరిగా అవ్వటము సహజమైపోతుంది.